విశాలాంధ్ర
ప్రకాశం
బాపట్ల
శుక్రవారం 17 అక్టోబరు 2025 8 పేజీలు

పేరులో ధర్మం విధుల్లో అధర్మం



విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :
ఆయన పేరులో మాత్రమే ధర్మ శబ్దం వినిపిస్తుంది.. కానీ ఆయన చేష్టలు మాత్రం అధర్మంతో జతకట్టి ఉంటున్నాయి. నెలలో 15 రోజులు పాటు కార్యాలయంలో విధులు నిర్వహించేటువంటి ఆ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తీరు వివాదాస్పదంగా మారింది. డ్రైవింగ్ లైసెన్సులు పొందేందుకు ఆయన్ను కలుసుకున్న ప్రజలకు చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. బయట నుండి ఏజెంట్లు ద్వారా లంచాలు అందే ఫైళ్లను మాత్రమే ఆయన ఓకే చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా వెళ్తున్న ప్రజలకు ఆ అధికారి చుక్కలు చూపిస్తున్నారు. సాయంత్రానికి ఆయన నియమించుకున్న ప్రైవేటు సైన్యాన్ని పంపించి వసూళ్లకు మిగతా 2 లో ...

- కాసులు ఇస్తే కానీ కదలని కాగితాలు
- ప్రైవేట్ వ్యక్తులచే సాయంత్రానికి వసూళ్లు
- ప్రజల పట్ల అడ్డగోలుగా అధికారి మాట తీరు
- వివాదాస్పదంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తీరు
- అంతా తెలిసిన చర్యలకు ఉపక్రమించని ఉన్నతాధికారులు

దశాబ్దకాల సమస్యకు 100 రోజుల్లోనే పరిష్కారం

- పూండ్ల గ్రామ భూములన్నీ వెబ్‌ల్యాండ్‌లో 2012లో తప్పుగా నమోదు
- నాటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరిగిన రైతులు
- సమస్యను ఇటీవల ఎమ్మెల్యే వేగేశన దృష్టికి తీసుకువచ్చిన రైతులు
- పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే
- తహశీల్దార్ షేక్ సలీమా ప్రత్యేక చొరవ
- శతరోజుల్లో పరిష్కారంతో తహసీల్దార్‌కు గ్రామస్తుల సలాం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల :
వెబ్‌ల్యాండ్‌లో సమస్యతో దశాబ్ధకాలంపైనే సతమతవుతున్న రైతులకు వంద రోజులు బాపట్ల తహశీల్దారు షేక్ సలీమా శాశ్వత పరిష్కారం చూపారు. కలెక్టర్ ఆదేశాలతో ఎమ్మెల్యే వేగేశన సూచనలతో గ్రామంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం గ్రామ సభ ఏర్పాటు చేసి వంద రోజుల్లోనే గ్రామంలోని భూములను పరిశీలించి వెబ్‌ల్యాండ్‌లో ఉన్న తప్పులను సవరణ చేసి రైతుల ఇబ్బందులు తీర్చటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో 2012లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన వెబ్‌ల్యాండ్‌లో భూముల నమోదు పక్రియలో అధికారుల తప్పిదం వల్ల గ్రామంలోని 750 మంది రైతులకు చెందిన 1045 ఎకరాలు పట్టా భూమిని అధికారులు మెట్ట, పుంజా, మాగాణి అంటూ తప్పులుగా నమోదు చేశారు. దీంతో అప్పటి నుంచి రైతులు సాగు మిగతా 2 లో ...

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల :
జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. గురువారం బాపట్ల సూర్యలంక బీచ్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన కోసం బీచ్‌లో ఏర్పాటు చేసిన శాండ్ ఆర్ట్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ఆర్ట్ ఈ నెల 19వ తేదీ వరకు ప్రదర్శిన కోసం ఉంచడం జరుగుతుందని పర్యాటకులు అందరూ కూడా చూడాలని ఆయన చెప్పారు. జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం రూ.97.52 కోట్ల మంజూరు చేయడం జరిగిందన్నారు. సూర్యలంక బీచ్‌లో టాయిలెట్లు, స్నానపు షవర్లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ను,క్లాత్ చేంజ్ రూమ్స్, పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వారం రోజులు పాటు షాప్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.షాప్ ఫెస్టివల్స్‌లో కార్యక్రమంలో ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ సేవింగ్స్‌తో పాటు అదనపు డిస్కౌంట్‌లను షాపు యజమాని ప్రజలకు ఇస్తారని చెప్పారు.జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రామాపురం బీచ్‌లో ఇటీవల జరిగిన సంఘటన చాలా బాధాకరమని ఇలాంటి సంఘటనలు జరగకుండా బీచ్ వద్ద 15 మంది స్విమ్మర్లను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు.సముద్ర స్నానానికి వెళ్లే పర్యాటకులు మద్యం సేవించి వెళ్ళరాదని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్, జీఎస్టి స్టేట్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గ్లోరియా కుమారి పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి సీఎం కృషి

- విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

2లో

వాహనాల జీఎస్టీ తగ్గుదలపై స్మాల్ వెహికల్స్ ర్యాలీ

ర్యాలీని ప్రారంభించిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుశీల, ఒంగోలు నగరం మేయర్ సుజాత

2లో

ఘనంగా శిద్దా సుధీర్ జన్మదిన వేడుకలు

4లో

వాహనాల జీఎస్టీ తగ్గుదలపై

స్మాల్ వెహికల్స్ ర్యాలీ

ర్యాలీని ప్రారంభించిన డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుశీల, ఒంగోలు నగరం మేయర్ సుజాత

విశాలాంధ్ర- ఒంగోలు : సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వాహనాల జీఎస్టీ తగ్గుదలపై హర్షం వ్యక్తం చేస్తూ ఒంగోలులో ఆర్టీవో ఆధ్వర్యంలో స్మాల్ వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఒంగోలులోని కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీని డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఆర్ సుశీల, ఒంగోలు నగర మేయర్ గంగాధర్ సుజాతలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సుశీల మాట్లాడుతూ వికాస్ విశ్వాస్, నమ్మకమైన అభివృద్ధి అనే నినాదంతో వాహనాలు యొక్క జీఎస్టీ తగ్గుదలను తెలియజేస్తూ స్మాల్ వెహికల్స్ ఆటో రిక్షా, మోటార్ కార్, క్యాబ్స్, లారీలు, బస్సులు, ట్రాక్టర్ల ఈ ర్యాలీలో పాల్గొన్నట్లు తెలిపారు. వివాహనాలకు జీఎస్టీ లో 28% నుండి 18 శాతం వరకు తగ్గుట, 12 శాతం నుండి ఐదు శాతం వరకు రాయితీ వస్తుందని తెలిపారు. గతంలో రూ. 9.80 లక్షల ఉన్న మినీ ట్రక్కు ప్రస్తుతం రూ. 2.75 లక్షల జీఎస్టీ పన్ను శాతం తగ్గిందన్నారు. జిల్లా ప్రజలు నూతన జీఎస్టీ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన బీజేపీ నాయకులు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : ప్రకాశం జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజాబాబుని ప్రకాశం భవనంలో ఆయన కార్యాలయంలో గురువారం బిజెపి ఎర్రగొండపాలెం నియోజక వర్గ అసెంబ్లీ ఇంచార్జి ఎనుముల నాగేశ్వరావు దోర్నాల భారతీయ జనతా పార్టీ దోర్నాల మాజీ అధ్యక్షుడు సురవరం వీరా రెడ్డి, భారతీయ జనతా పార్టీ పెద్దారవీడు మాజీ అధ్యక్షుడు బొచ్చు కోటిరెడ్డి తదితరులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

భూముల సమస్యలు పరిష్కారానికి రైతుల ఐక్యం కావాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు

విశాలాంధ్ర-పామూరు : ఎన్నో సంవత్సరాల టినుండి భూముల సమస్యలు పరిష్కారం కాలేదని పరిష్కారం కోసం రైతులు ఐక్యం కావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు పిలుపునిచ్చారు. గురువారం రైతు సంఘం మండల కమిటీ పప్పు వెంకోబ్ రావు మీటింగ్ హాల్లో యం ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. వెంకటరావు మాట్లాడుతూ పామూరు మండలంలో ఎన్నో సంవత్సరం నుండి చుక్కల భూమి సమస్యతో రైతులు బాధపడుతున్న పాలకులకు, అధికారులకు పట్టడం లేదని ఆరోపించారు. ఏ ప్రభుత్వం వచ్చిన రైతులు వెన్నెముక లాంటి వారిని బహిరంగ సభలో మాట్లాడుతున్న వాస్తవానికి ప్రభుత్వం నుండి రాజకీయ నాయకుల నుండి ఎలాంటి సహాయం అందడం లేదని ఆరోపించారు. రైతుల బాధలు పాలకులకు పట్టడం లేదని ఆరోపించారు. ఆన్ లైన్ పేర్లు తో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఈ నెల 22వ తేదీన పామూరు మండలంలో రైతు సంఘం విస్తృత సమావేశం జరుగుతుందని రైతులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

100 రోజుల్లోనే పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

చేయటం మినహా ఆ భూమి క్రమ విక్రయాలకు గానీ ఆపద వచ్చినప్పుడు అమ్ముకునేందుకు లేదా పిల్లల చదువులకు పెళ్లిలకు అవసరమైనప్పుడు అమ్మటానికి ఇవ్వటానికి వీలు లేకుండా పోయింది. అధికారుల తప్పిదాల వల్ల అప్పటి నుంచి గ్రామస్తులు సమస్య పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా పరిష్కారానికి నోచుకోలేదు.

- పూండ్ల గ్రామ రైతులు ఇదే సమస్యను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ దృష్టికి తీసుకుని రాగా ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు వివరించి రైతుల సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, బాపట్ల తహశీల్దారు షేక్ సలీమా జులై మాసంలో గ్రామ సభ నిర్వహించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే తహశీల్దారు సలీమా రెవిన్యూ బృందంతో రంగంలోకి దిగి గ్రామంలోని 956 సర్వే నంబర్లలో ఉన్న 1045 ఎకరాల భూములను పరిశీలించి పట్టా భూములుగా సవరణ చేశారు. దీంతో నేడు గ్రామంలోని రైతులు వారి భూములు క్రయవిక్రయాలు చేసుకోవటానికి వెసులుబాటు వచ్చింది. దశాబ్దకాల సమస్యను ఎమ్మెల్యే వేగేశన దృష్టికి తీసుకురావటంతో తహశీల్దారు షేక్ సలీమా ప్రత్యేక చొరవతో మా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి సీఎం కృషి

- విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- రూ.143 కోట్లతో గురుకులాలు, వసతి గృహాలకు మరమ్మతులు
- సంక్షేమ వసతి గృహాల్లో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలి
- విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : 'పి-4'లో భాగంగా పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం త్రిపురాంతకం మండలం దూపాడు డా.బి. ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, వంటగది పరిసర ప్రాంతాలను మంత్రి పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ 4 కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని అందులో భాగంగానే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉమ్మడి జిల్లాకు ఒక ప్రత్యేక వైద్య అధికారిని నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం రూ.143 కోట్లతో గురుకులాలు, వసతి గృహాలకు మరమ్మతులు చేశామన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో 100% ఉత్తీర్ణతే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడలు శరీర ధృఢత్వానికి, మానసిక ఆనందానికి తోడ్పడతాయన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని కష్టపడి చదివి తల్లిదండ్రులకు కలలు నెరవేర్చాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆయన వెంట దుపాడు సర్పంచ్ అనుషా, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మేకల వలరాజు, నాగార్జున సాగర్ కాల్వా నీటి సరఫరా కమిటీ చైర్మన్ దేవినేని చలమయ్య,సీనియర్ నాయకులు ఆళ్ల నాసర్ రెడ్డి, లక్ష్మణ్ చౌదరి, గుర్రం సునీల్ మరికొందరు నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణపై ధ్వజమెత్తిన 'అన్నా'

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ మండల పార్టీ అధ్యక్షులు పోరెడ్డి చెంచిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురువారం మండలంలోని బోడపాడు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నియోజకవర్గ వర్గ వైసీపీ ఇన్చార్జి,మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు ,నెల్లూరు పార్లమెంట్ పార్టీ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చారని అన్నారు. తద్వారా అతి తక్కువ ఖర్చుకే సూపర్ స్పెషాలిటీ వైద్యం అందాలని జగన్ ఆశించారని తెలిపారు. ఈ క్రమంలో ఐదు కళాశాలలో తరగతులు ప్రారంభం అయ్యాయని, మరో రెండు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నా రాంబాబు అన్నారు.

నెల్లూరు పార్లమెంటు పరిశీలకులు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిర్మాణంలో ఉన్న కాలేజీలనూ పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే రైతులను, నిరుద్యోగులను ఆదుకుంటానని చెప్పి అధికారం అనంతరం వారిని మోసం చేసిన ఘనుడు చంద్రబాబు నాయుడని విమర్శించారు. వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి మాట్లాడుతూ పేదలకు వైద్య విద్య అందించాలనే సామాజిక దృక్పథంతో మాజీ ముఖ్యమంత్రి జగన్ మెడికల్ కళాశాలను తీసుకొస్తే వాటిని ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న ప్రైవేటీకరణతో పేరుతో కొంతమంది వ్యక్తులకు దారాదత్తం చేయడం దారుణమన్నారు. ప్రైవేటీ కరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వైసిపి రాష్ట్ర పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు వెన్నా హనుమారెడ్డి ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి స్టేట్ ట్రేడ్ యూనియన్ జాయింట్ సెక్రెటరీ బట్టగిరి తిరుపతి రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు బొగ్గు రవి చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అధర్మం

(మొదటిపేజీ తరువాయి)

పాల్పడుతున్నారు.

జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో అవినీతి వేళ్ళు ఊనికిపోయింది. కొందరు క్రింది స్థాయి అధికారులకు లంచాలు తీసుకోవడం వ్యసనంగా మారిపోయింది. ప్రస్తుతం రవాణా శాఖ కార్యాలయంలో ఓ అధికారి విచ్చలవిడి తనం, నోటి దురుసు చర్చిని అంశంగా మారింది. కార్యాలయంలో 15 రోజులు పాటు పనిచేసే అధికారి తీవ్ర స్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని చర్చలు జరుగుతున్నాయి. బయట నుండి ఏజెంట్ల ద్వారా వచ్చేటువంటి ఫైళ్లను మాత్రమే ఆయన ఆమోదిస్తున్నారని, మధ్యవర్తులు లేకుండా కార్యాలయానికి వెళ్లే ప్రజల పట్ల చులకన భావంతో వ్యవహరిస్తుండటం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొంతమేర ఏజెంట్ల ప్రభావం ఉన్న క్రమంగా కొత్త ప్రభుత్వం కొలువు తీరాక కొందరు అధికారులు తమ తీరు మార్చుకొని వెనక్కు తగ్గారు. అయితే లక్షల్లో లంచాలు కాజేయడం వ్యసనంగా మార్చుకున్న కొందరు అధికారులు పాత పద్ధతిలోనే కొనసాగుతున్నారు. మధ్యవర్తుల నుండి వచ్చేటువంటి ఫైళ్లకు ఒక ప్రత్యేక నెంబర్ను కేటాయించి సాయంత్రానికి పట్టికను తయారు చేస్తున్నారు. దాని ఆధారంగా ప్రైవేటుగా నియమించుకున్న వ్యక్తుల ద్వారా మధ్యవర్తుల దగ్గరకు పంపి ప్రతి ఫైలుకు 700 నుండి 1000 రూపాయలు వరకు వసూలు చేస్తున్నారు. ప్రతిరోజు కార్యాలయానికి 30 నుండి 50 అప్లికేషన్లు వస్తున్న నేపథ్యంలో మధ్యవర్తుల ద్వారా లంచాలు ముట్టే ఫైళ్లను సుమారు 30 నుండి 40 మాత్రమే ఆ వివాదస్పద అధికారి ఆమోదిస్తున్నారు. నేరుగా కార్యాలయానికి వెళ్లే ప్రజల ఫైళ్లు రిజెక్ట్ అవుతున్నాయి. ఫలితంగా విధి లేని పరిస్థితుల్లో ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించి అధిక మొత్తంలో డబ్బులు ముట్ట చెప్పాల్సి వస్తుంది. ఇంత వ్యవహారం జరుగుతున్న ఉన్నత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించటం అంతు పట్టిన వ్యవహారంగా మారింది. ఉన్నతాధికారులను సైతం తన జోలికి వస్తే మీ లొసుగులు బయటేస్తానంటూ ఆ అధికారి బెదిరింపులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేవు. ప్రభుత్వ కొలువులో యూనిఫామును అడ్డం పెట్టుకొని ప్రజల డబ్బులతో జీతాలు తీసుకునే అధికారులు వారిపై జులుం ప్రదర్శించడం పట్ల ప్రజల్లో వ్యతిరేకత నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారాలు మేల్కొని లంచాలతో శాఖ పరువును భ్రష్టు పట్టిస్తున్న అధికారిని కట్టడి చేసి దాడిలో పెట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఘనంగా బాల యేసు దేవాలయ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : నెల్లూరు మేత్రాసనం మార్కాపురం విచారణ పెదనాగులవరం గ్రామంలో బాల యేసు దేవాలయ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం మార్కాపురం చర్చి ఫాదర్ ఎర్రం జాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు మేత్రాణులు ఎండి ప్రకాశం ముఖ్య అతిథిగా పాల్గొని దేవాలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించి వికర్ జనరల్ ఇన్నయ్య, మనీ, ఛాన్సలర్ జోసెఫ్, 12 మంది గురువులతో ప్రథమ కృతజ్ఞత బలి పూజ సమర్పించారు. ఈ సందర్భంగా మేత్రాణులు ఎండి ప్రకాశం సందేశమిస్తూ 1963 సంవత్సరంలో కొరియా కోన్ పెదనాగులవరంలో చర్చి నిర్మాణం చేశారని అది శిథిలావస్థకు చేరడంతో దేవుని కృప వలన ఫాదర్ ఎర్రం జాన్ ఆధ్వర్యంలో సుందరమైన నూతన దేవాలయ నిర్మాణం జరిగిందని అన్నారు. పలు విచారణల నుండి భక్తులు యువతీ యువకులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-పామూరు : కందుకూరు నియోజకవర్గం, గుడ్లూరు మండలం, దారకానిపాడు గ్రామానికి చెందిన కాపు యువ నాయకుడు తిరుమలశెట్టి నాయుడు ను చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని ఎంపీటీసీల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర, జిల్లా కాపు నాయకులతో కందుకూరు డీఎస్పీ ని కలిసి తిరుమల శెట్టి నాయుడును చంపిన నిందితులకు శిక్ష పడేలా చూడాలని కోరారు. కాపు నాయకులు ఆమంచి స్వాములు, ఏలూరి ప్రసాద్, రాయల్ పీపుల్ ఫ్రంట్ రెడ్డి శేఖర్ రాయల్,అమ్మ శ్రీనివాస్, బెల్లం కొండ విజయ లక్ష్మి , కాప్స్ రాక్, కొంకల రాంమోహన్, ఆర్.వంశీ, కళ్యాణ్ భాయ్, వంశీ, యం.వివేక్, వెంగళశెట్టి బాబూరావు, చలివేంద్ర సుబ్బారావు, ఇండ్ల నరసింహ రావు, కంట కోటయ్య, గోసుల సురేంద్ర, నక్క రమేష్ పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరి

కలెక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డుల నమోదు తప్పనిసరిగా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు తక్షణమే చేపట్టాలని కలెక్టర్ చెప్పారు.తల్లి బిడ్డకు జన్మనివ్వగానే వైద్యశాలలోనే ఆధార్ నమోదు చేయాలన్నారు. ఏదైనా కారణం చేత నమోదు కాలేకపోతే అంగన్వాడీ కేంద్రం పరిధిలోనే ఆధార్ నమోదు తప్పనిసరిగా జరగాలన్నారు.ఐదు నుంచి ఏడు సంవత్సరాలలోపు బాలలకు బయోమెట్రిక్ నవీకరణ విధిగా నిర్వహించాలన్నారు.లేకుంటే ఆధార్ కార్డులు రద్దయ్యే అవకాశం ఉందన్నారు.ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.అలాగే 15 నుంచి 17 సంవత్సరాల లోపు యువతి యువకుల ఆధార్ కార్డులలో బయోమెట్రిక్ నవీకరణ తప్పనిసరిగా చేపించాలన్నారు.లేకుంటే వారికి ఆధార్ కార్డులు రద్దు కానున్నాయన్నారు.జిల్లాలో ఇప్పటివరకు 21,671 ఐదు నుంచి ఏడేళ్లలోపు బాలలు ఆధార్ కార్డులు నవీకరణ పెండింగ్లో ఉన్నాయన్నారు.అలాగే 14,536 మంది 15 నుంచి 17 సంవత్సరాల లోపు యువతీ యువకుల ఆధార్ నవీకరణ పెండింగ్లో ఉండడంపై ఆరా తీశారు.చిన్నారుల వయస్సు ఎదిగే కొద్దీ చేతి వేలిముద్రలు మారుతున్న నేపథ్యంలో ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియను తప్పనిసరిగా చేసిందన్నారు.ప్రజలకు అవగాహన కల్పించి తక్షణమే ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.విద్యార్థుల ఆధార్ నవీకరణ కొరకు ఈనెల 23వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఆధార్ నవీకరణ ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు.విద్యార్థులకు ఎలాంటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 110 ఆధార్ నమోదు కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 80 కేంద్రాలు పని చేయడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలలో బదిలీల ప్రక్రియ నేపథ్యంలో ఏర్పడిన సాంకేతిక సమస్యల ద్వారా 30 కేంద్రాలు పనిచేయడం లేదని ఆధార్ కార్డుల రీజినల్ మేనేజర్ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు.ప్రతి మండలంలో ఆధార్ కార్డుల నమోదు కేంద్రం తప్పనిసరిగా ఉండాలన్నారు.త్వరలోనే మిగిలిన కేంద్రాలు ప్రారంభించాలని కలెక్టర్ చెప్పారు.ఐదు నుంచి ఏడు సంవత్సరాలలోపు బాలల బయోమెట్రిక్ నవీకరణ,15 నుంచి 17 సంవత్సరాలలోపు యువతీ యువకుల ఆధార్ నవీకరణ ప్రక్రియకు ఎలాంటి రుసుము లేదన్నారు.ఆ రెండు వయస్సుల వారి నవీకరణ ప్రక్రియకు ఉచిత సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం,జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి రాధా మాధవి,డిపిఓ ప్రభాకర్ రావు,ఆధార్ జిల్లా కో-ఆర్డినేటర్ అశోక్ బాబు,కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ వందనం పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-మార్కాపురం : రవాణా శాఖ ప్రాంతీయ అధికారిణి వై.చందన ఆధ్వర్యంలో జీఎస్టీ పన్నుల తగ్గింపుపై గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ ఎస్వీకేపీ కాలేజీ నుండి సెవెన్ హిల్స్ వరకు సాగింది. ఈ సందర్భంగా సిటిఓ నరసింహారావు, ఆర్టీవో చందన, టిడిపి నాయకులు కందుల రామిరెడ్డిలు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ అనంతరం చందన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక చరిత్రలో మైలురాయిగా నిలిచాయని పేర్కొన్నారు. నిత్యావసరాలు, మందులపై జీరో జీఎస్టీ, వ్యవసాయ పరికరాలపై పన్ను తగ్గింపు వంటి నిర్ణయాలు ప్రజలకు ఉపశమనం కలిగించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీవో నరసింహ రావు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలు, భాగస్వాముల ప్రేరణ కార్యక్రమాల గోడ పత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల : పరిశ్రమలు భాగస్వాముల ప్రేరణ కార్యక్రమాలు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. పరిశ్రమలు పెట్టుబడుల భాగస్వాముల సదస్సును పురస్కరించుకొని రూపొందించిన గోడ పత్రాలను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ గురువారం కలెక్టరేట్లో విడుదల చేశారు. పెట్టుబడిదారుల భాగస్వాముల సదస్సు నవంబర్ 14,15వ తేదీలలో విశాఖపట్నంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని కలెక్టర్ చెప్పారు.ప్రపంచ స్థాయిలో పెట్టుబడులదారులను ఆకర్షించేలా విశాఖపట్నంలో పరిశ్రమలకు సంబంధించి సదస్సు జరుగుతుందన్నారు. పరిశ్రమల ఆధునికీకరణ, స్థిరీకరణ, పెట్టుబడిదారులు సంసిద్ధత, తోడ్పాటు, పరిశ్రమల పరిశుభ్రత,పరిశ్రమలలో మొక్కలు నాటడం, పర్యావరణ అనుకూలతలు తదితర అంశాలపై ఈనెల 17 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఏపీఐఐసీ ద్వారా జిల్లాలోని అన్ని పరిశ్రమలలో ఈ సదస్సులు జరుగుతాయన్నారు. ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు పారిశుద్ధ్యం, పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు.ఈనెల 29 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు ఓత్సాహిక పెట్టుబడిదారుల సహకారంతో పరిశ్రమలు అభివృద్ధి చేయడం,నవంబర్ ఆరో తేదీ నుంచి 15వ తేదీ వరకు పరిశ్రమల ఆధునీకీకరణ, స్థిరీకరణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరిశ్రమల అభివృద్ధితో అన్ని రంగాలు వృద్ధి చెందుతాయన్నారు. చైతన్య కార్యక్రమాలు విరివిగా చేపట్టాలని ఆయన పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ జి.గంగాధర్ గౌడ్,ఏపీఐఐసీ గుంటూరు జోనల్ మేనేజర్ నరసింహారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ రామకృష్ణ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం దామవరపు అరవింద్ 2019 సంవత్సరంలో చీరాలకు చెందిన వహీద అను మహిళను ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. అప్పటి నుండి అరవింద్ వహీదలు కారుమంచి గ్రామంలో ఉంటున్నారు. ఈ క్రమంలో దామవరపు వహీదాకు తన భర్త సంపాదన కుటుంబ పోషణకు సరిగా సరిపోకపోవడం వలన మరియు వహీదాకు గత కొంతకాలం నుండి కడుపులో నొప్పిగా ఉంటున్నట్లు, తన భర్త అరవింద్ పలుమార్లు హాస్పిటల్లో చూపించినట్లు, సదర విషయం వహీద తన తల్లిదండ్రులతో చెప్పగా వాళ్లు పలుమార్లు చీరాల నుండి వచ్చి వహీదను చూసి వెళుతున్నారు. వహీద తల్లి అయిన మస్తాన్ బి కూడా పెద్ద హాస్పిటల్లో చూపిస్తాలే అని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. సదరు దామవరపు వహీద తేదీ 15.10.2025న ఉదయం తనకి విపరీతమైన కడుపు నొప్పి రావడంతో కడుపునొప్పి భరించలేక ఇంటిలో ఉన్న ఎలుకల మందు తినగా, గమనించిన వహీదా భర్త అయిన అరవింద్ చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రకాశం హాస్పటల్ నందు చేర్చారు. తరువాత వహీద 16-10-2025న ఒంగోలు ప్రకాశం హాస్పటల్ నందు చికిత్స పొందుతూ చనిపోయినట్లు డ్యూటీ డాక్టర్గా తెలియజేశారు. సదర విషయము గురించి వహీదా తల్లి టంగుటూరు పిఎస్ నందు రిపోర్ట్ చేయగా, స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి నారు. టంగుటూరు తహసీల్దార్ ఆంజనేయులు ఒంగోలు జిజిహెచ్ నందు శవపంచనామా నిర్వహించారు.

14 నుండి కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ జాతీయస్థాయి ప్రతిభ పోటీ పరీక్ష



విశాలాంధ్ర-ఒంగోలు : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు క్యాంపస్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ప్రతిభ పరీక్షని నవంబర్ 14 నుండి 18 వరకు నిర్వహిస్తున్నట్లు కే.ఎల్. డీమ్డ్ యూనివర్సిటీ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు శ్రీ చైతన్య కళాశాల ఆవరణలో పోటీ పరీక్షకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షలో ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ. 100 కోట్ల మేర మెరిట్ స్కాలర్ షిప్స్ అందజేస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరములో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో తమ విద్యార్థులు 4600లకు పైగా క్యాంపస్ ప్లేస్మెంట్స్ ఆఫర్ పొందారని వారిలో సంవత్సరానికి రూ.40 లక్షల నుండి 75 లక్షల వరకు అత్యధిక వేతనాలు పొందిన వారు కూడా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమములో కే.ఎల్. డీమ్డ్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ ఇంచార్జ్ డా.జె.వి. షణ్ముక కుమార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జోనల్ హెడ్. బి. శివరామకృష్ణ, శ్రీ చైతన్య కళాశాల డీన్ యం.రామకృష్ణ, ప్రిన్సిపల్స్ జి.వెంకయ్య, ఎ.రామాంజనేయులు, కె.రవి కిషోర్, అకాడమిక్ ఇంచార్జ్ బి.కిషోర్ మరియు కే.ఎల్. డీమ్డ్ యూనివర్సిటీ ప్రకాశం, నెల్లూరు జిల్లాల మేనేజర్లు కె.రాంబాబు, పి.ఆంజనేయ వరప్రసాద్ రావు, ఆర్. శేఖర్ బాబు, ఎ.మస్తాన్ వలి, షేక్ నయాబ్, జి. పార్థసారధి, కళ్యాణ్, జి.చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

అభిమానుల కోలాహలం నడుమ ఘనంగా శిద్దా సుధీర్ జన్మదిన వేడుకలు

● జిల్లా వ్యాప్తంగా సామాజిక సేవ కార్యక్రమాలు
● జ్యోతి గ్రానైట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ఒంగోలు : పారిశ్రామిక వేత్త, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షులు, మాజీమంత్రి శిద్దా రాఘవరావు తనయులు శిద్దా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు ఒంగోలులోని వారి నివాసంలో అభిమానుల కోలాహలం నడుమ అట్టహాసంగా జరిగాయి. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడానికి అభిమానులు, పార్టీ నాయకులు, యువత, వ్యాపార వర్గాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ వేడుకలలో అభిమానులు, వ్యాపార, వాణిజ్య, గ్రానైట్ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని శిద్దా సుధీర్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతుల సమక్షంలో ఒంగోలులోని వారి నివాసంలో లక్ష్మి గ్రానైట్ మేనేజర్ ఉప్పుటూరి కృష్ణ, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును శిద్దా సుధీర్ కుమార్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి కట్ చేశారు. తొలుత శిద్దా రాఘవరావు దంపతులు శిద్దా సుధీర్ కుమార్ కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉప్పుటూరి కృష్ణ, ఆధ్వర్యంలో భారీ గజమాలతో శిద్దా సుధీర్ కుమార్ దంపతులు శిద్దా రాఘవరావు దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, పల్లపోతు వెంకటేశ్వర్లు, జలదంకి కృష్ణారావు జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు భారీ కేక్ మరియు గజ మాలతో శిద్దా సుధీర్ కుమార్ దంపతులను, శిద్దా రాఘవరావు దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు,చీమకుర్తి, దర్శి,మార్కాపురం, పొదిలి,ప్రాంతాలకు చెందిన ప్రముఖులు ఆర్యవైశ్య సంఘం నాయకులు శిద్దా సుధీర్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియచేశారు.అభిమానులు ఏర్పాటు చేసిన బాణసంచా తో శిద్దా సుధీర్ కుమార్ నివాసం సందడి నెలకొంది.

చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో

శిద్దా సుధీర్ కుమార్ జన్మదినం సందర్భంగా ఆలయ అర్చకులు శిద్దా సుధీర్ కుమార్ దంపతులను మంగళ వాయిద్యాల నడుమ,వేద మంత్రాలతో పూర్ణ కుంభ స్వాగతం పలికారు.అనంతరం శిద్దా సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి క్షేత్రంలో వేంచేసివున్న సకల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ.గిరి బాబు,కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ శిద్దా సుధీర్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్.వెంకటేశ్వర్లు,వాసవి గ్రానైట్, గోల్డెన్ గ్రానైట్ సిబ్బంది ఆధ్వర్యంలో భారీ గజమాలను శిద్దా సుధీర్ కుమార్ దంపతులకు అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు.చీమకుర్తి కి చెందిన పలువురు ప్రముఖులు శిద్దా సుధీర్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు.

ఆదర్శంగా నిలిచిన సామాజిక సేవా కార్యక్రమాలు

శిద్దా సుధీర్ కుమార్ జన్మదినం సందర్భంగా శిద్దా అభిమానులు శ్రీ హరిహర క్షేత్రంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా చీమకుర్తి ఎస్.కె.ఆర్ బధిరదుల పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్,బంట్ల మూడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్,ఆట వస్తువులు,పాటి మీద పాలెం ప్రాథమిక స్కూల్ మధ్యాహ్న భోజన పథకం అమలుకు గ్యాస్ ఖర్చును,మరియు ఇంటర్నెట్ సదుపాయం శిద్దా సుధీర్ కుమార్,తల్లిదండ్రులతో కలిసి అందచేశారు.దర్శి నగరంలో శిద్దా అభిమానులు మరియు మందాది సుబ్బారావు ఆధ్వర్యంలో వృద్ధులకు నూతన వస్త్రాలు, అన్నదానం, మునిసిపల్ సానిటరీ కార్మికులకు చీరలు పంపిణీ నిర్వహించారు. వేద పండితులు.

జ్యోతి గ్రానైట్‌లో..

శిద్దా సుధీర్ కుమార్ జన్మదినం సందర్భంగా గుళ్ళాపల్లి ఎస్ఇ. జెడ్ జ్యోతి గ్రానైట్ ఆవరణలో జరిగిన, రక్త దాన శిబిరానికి గ్రానైట్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.జ్యోతి గ్రానైట్ సి.ఓ.ఓ.ఎమ్.శివరామ్ ఒంగోలు రిమ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్యోతి గ్రానైట్ మేనేజింగ్ డైరెక్టర్ శిద్దా సుధీర్ కుమార్ రక్తదాన శిబిరం ప్రారంభించారు.ఈ రక్త దాన శిబిరంలో సుమారు 100 యూనిట్లు రక్తం దాతల నుండి సేకరించినట్లు సి.ఓ.ఓ ఎమ్. శివరామ్ తెలిపారు. అనంతరం సి.ఓ.ఓ ఎమ్.శివరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను శిద్దా సుధీర్ కుమార్ కట్ చేశారు.జ్యోతి గ్రానైట్ సిబ్బంది భారీ గజమాలతో శిద్దా సుధీర్ కుమార్ దంపతులను సత్కరించారు.

డీఏ వెంటనే ప్రకటించాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కే.ఎర్రయ్య

విశాలాంధ్ర-త్రిపురాంతకం : ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుకగా డిఏ ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కె.యర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. త్రిపురాంతకం మండలంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగినది. కేశినేనిపల్లి, దూపాడు, గొల్లపల్లి విశ్వనాధపురం గణపవరం పాఠశాలలో సందర్శించి ఉపాధ్యాయ సమస్యలను సమీకరించారు. బదిలీ అయి రిలీవర్ లేక ఆగిపోయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి ఆ స్థానాల్లో విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ స్కేల్ ఇవ్వాలి పిఎఫ్, ఏపీ జి ఎల్ ఐ లోన్లను వెంటనే విడుదల చేయాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉన్న పెండింగ్ ఫైల్స్ ను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు ఎం జాన్ సామ్యూల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎన్ ప్రసాదరావు మండల నాయకులు చప్పిడి ఏడుకొండలు ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొట్టిన కారు

విశాలాంధ్ర-ముండ్లమూరు : రోడ్డు పక్కన నిలబడిన వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన గురువారం వేంపాడులో జరిగింది. వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన గండి కమలాకర్ రోడ్డు ప్రక్కన నిల బడి ఉండగా అద్దంకి నుండి దర్శి వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టగా కాలు చేయి విరగడంతో క్షతగాత్రుడిని నరసరావుపేట ఓ ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు.

ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా ఏలూరి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం : ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టుల జాబితాను బుధవారం సాయంత్రం ఆ పార్టీ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 19 మంది నాయకులకు ఈ జాబితాలో చోటు దక్కింది. ప్రకాశం జిల్లా నుంచి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ఈ జాబితాలో స్థానం పొందడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ "ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని, బీజేపీ సిద్ధాంతాలు, ప్రజా ప్రయోజనాలు ప్రతీ వేదికలో గళమెత్తి వినిపిస్తానని పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దారవీడు మండలం, గొబ్బూరు గ్రామానికి చెందిన ఏలూరి రామచంద్రారెడ్డి 2014లో మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా, అలాగే పశ్చిమ రాయలసీమ శాసన మండలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేశారు. గతంలో కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో కూడా కీలక భూమిక పోషించారు, అయితే జాతీయవాద భావజాలంతో మెలిగే ఆయన ఆ పార్టీల వ్యవహారశైలి నచ్చక దేశం కోసం, ధర్మం కోసం పనిచేయాలన్న సంకల్పంతో 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. విద్యార్థి దశనుంచే రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థి సమయంలో ఏబీవీపీలో పనిచేశారు. స్పష్టమైన వాగ్దాటి, విశ్లేషణా సామర్థ్యం కలిగిన నేతగా ప్రసిద్ధి చెందిన ఏలూరి పలు సందర్భాల్లో వివిధ టీవీ చర్చల్లో బీజేపీ వాయిస్‌ను బలంగా వినిపిస్తారన్న నమ్మకంతో పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే రాజకీయంగా, మేధోపరంగా బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డిని పార్టీ భవిష్యత్తు వ్యూహాత్మక ఆలోచనల్లో కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇక ఆయనకు ఈ పదవి దక్కడంతో అనుచరగణం సంబరాల్లో మునిగితేలుతున్నారు.

విభజన హామీలు అమలు చేయకుండా మోసం

మోదీ గో బ్యాక్ అంటూ
సీపీఐ, సీపీఎం నిరసన

విశాలాంధ్ర-మార్కాపురం : విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ స్టీల్ ప్లాంట్ కు నిధులు, గనుల కేటాయింపు, కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు తదితర హామీలను అమలు చేయకుండా మోడీ రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత లేదని, గో బ్యాక్ నరేంద్ర మోడీ, గో బ్యాక్ అంటూ సిపిఎం, సిపిఐ పార్టీ లు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా గురువారం సిపిఐ కార్యాలయం వద్ద వామ పక్షాలు ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు అందె నాసరయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.సోమయ్యలు మాట్లాడుతూ విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా రాష్ట్రానికి నరేంద్ర మోడీ రావడం సరైనది కాదని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాజధాని అమరావతికి నిధులు ఇస్తామని చెప్పి వేల కోట్ల రూపాయలు రుణం పేరుతో అప్పులు ఇవ్వడం, వడ్డీలు వసూలు చేయడం అన్యాయమని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో కూరుకు పోయేలా చేయడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు బిజెపి శతవిధాల ప్రయత్నం చేస్తుందని,దిన్ని అడ్డుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో కేంద్రానికి ధన్యవాదాలు చెబుతూ తీర్మానం చేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి విశాఖను ఉక్కును ప్రభుత్వ రంగంలోనే అభివృద్ధి చేయాలని అన్నారు. పోలవరం ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని, ముంపు బాధిత గిరిజనులకు పునరావస పనులు వెంటనే పూర్తిచేయాలని అన్నారు.అదే విధంగా జీఎస్టీ పేరుతో 8 సంవత్సరాల పాటు 55లక్షల కోట్ల రూపాయలు ప్రజల నుండి పీల్చి పిప్పి చేసి దోపిడీకి పాల్పడింది నరేంద్ర మోడీ ప్రభుత్వం కాదా అని వారు ప్రశ్నించారు.ఇంతకాలం దోపిడీ చేసి ఇప్పుడు జీఎస్టీ తగ్గింపు పేరుతో తమ స్వప్రయోజనాల కోసం, ప్రచార ఆర్భాటాల కోసం దేశవ్యాప్తంగా సభలు నిర్వహించ తలపెట్టడం సిగ్గుచేటని వారు విమర్శించారు. ఈ నాయకులకు రాబోవు కాలంలో తగిన మూల్యం తప్పక చెల్లించుకుంటారని హెచ్చరించారు.ప్రధాని కర్నూలు, నంద్యాల జిల్లాలకు వస్తున్న సందర్భంగా రాష్ట్ర విభజన హామీలు,కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సొంత గనుల కేటాయింపు, రాయలసీమ ప్రాంత అభివృద్ధికి బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ ప్రకటించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా చొరవ చూపాలని లేకపోతే ప్రజాధనం వృధా తప్ప ప్రధానమంత్రి పర్యటనతో ఎలాంటి ప్రయోజనం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దుప్పట్ల కాశయ్య, సిపిఎం టౌన్ కార్యదర్శి, డీకేఎం రఫీ, ఎస్.కె నన్నేసా, ఏనుగుల సురేష్, జన్మల నాగయ్య, అడివయ్య, రైతు సంఘం నాయకులు గాలి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌తో

వాహనదారులకు మేలు

విశాలాంధ్ర - రేపల్లె : బాపట్ల జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో రేపల్లెలోని నెహ్రూ విగ్రహం వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ 2.0. ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటార్ గూడ్స్ వెహికల్స్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ బాపట్ల మోటార్ వెహికల్ ఇనిస్పెక్టర్ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 2 వీలర్స్ ఫోర్ వీలర్స్ పై గతంలో ఉన్న 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించారని అదేవిధంగా ట్రాక్టర్లు వాటి విడిభాగాలు, టూవీలర్స్ టైర్లు వాటి విడి భాగాలు వంటి వాటిపై గతంలో ఉన్న 18 శాతం నుండి 12 శాతంకు,మోటారు వెహికల్ ప్రమాదం సమయంలో థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ 12 శాతం నుండి ఐదు శాతానికి తగ్గించడంతో పేద మధ్యతరగతి వర్గాల తో పాటు ఆయా మోటార్ వెహికల్స్ షోరూం వారికి కూడా తగ్గిన జీఎస్టీతో ఎంతో ప్రయోజనం కల్గిందని ప్రసన్నకుమారి ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో మోటారు వాహనదారులలో షోరూమ్ యజమానుల్లో సంతోషం వ్యక్తం అవుతున్నదని తెలిపారు. ఈ ర్యాలీలో పట్నంలోని టీవీఎస్, హీరో హోండా షోరూం యజమానులు, సిబ్బంది, వాహనదారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ కనకారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు అనగాని శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు, శానిటరీ ఇనిస్పెక్టర్ రామ చంద్రరావు, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని చెరుకూరు జడ్పీ హైస్కూల్ నందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యాధికారి ఉప్పుటూరు హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు సీపీఆర్ ప్రక్రియ విధానాన్ని బోధించారు. ఎప్పుడైతే ఒక వ్యక్తి అపస్మారకంగా, గుండె కొట్టుకోకుండా, ఊపిరి తీసుకోకుండా స్పందన లేని స్థితిలో ఉంటాడో, అప్పుడు ఛాతి ఎముకపై మన రెండు చేతులను ఇంటర్ లాకింగ్ చేసి నిమిషానికి 100 నుంచి 120 సార్లు రెండు అంగుళాల లోతుకి మోచేతుల దగ్గర వంచకుండా బలంగా నొక్కాలనీ, ప్రతి 30 కంప్రెషన్స్‌కి రెండు సార్లు అపస్మారకంగా ఉన్న వ్యక్తి నోటిలో గాలి ఊదాలని, ఆ విధంగా వ్యక్తి స్పృహలోకి వచ్చేదాకా లేదా అంబులెన్స్ లేదా వైద్య బృందం వచ్చేవరకు చేస్తూ ఉండడంతో ప్రతి నలుగురిలో ఒకరిని కాపాడొచ్చన్నారు. హెచ్ఇవో సత్యనారాయణ, స్టాఫ్ నర్స్ చంద్రశేఖర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ మాసోత్సవం

విశాలాంధ్ర - పర్చూరు : పోషణ ఆహార ప్రాధాన్యతపై అవగాహన ఉండాలని సీడీపీవో సుభద్ర తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ప్రాజెక్టు పరిధిలో పోషణ మాసోత్సవం ముగింపు వేడుక కార్యక్రమం జరిగింది. వేడుకలో సీడీపీవో సుభద్ర, మండల విద్యాధికారులు శివ కోటేశ్వరరావు, వెంకటరామయ్య, డిప్యూటీ తహశీల్దార్ సుధారాణి ఐసిపిఎస్ విభాగం అధికారులు కృష్ణ, రాము పాల్గొన్నారు. పోషణ మాసోత్సవం ముగింపు సందర్భంగా నిర్వహించిన సామూహిక శ్రీమంతాలు అందరిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా వెల్ బేబీ ప్రదర్శనలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉప్పుటూరు హైస్కూల్‌లో విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలక బహుమతులు అందజేశారు. కార్యక్రమం ద్వారా పోషకాహార ప్రాధాన్యతతో పాటు బాలికల ప్రతిభను వెలికితీసే దిశగా ఐసీడీఎస్ శాఖ స్ఫూర్తిదాయక మాదిరిని చాటిందని అధికారులు తెలిపారు.

కొప్పరం మేజరులో పూడికతీత పనులు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండ లంలోని కొప్పరం ఆయకట్టు పరిధిలోని మేజరు కాలువ పూడిక తీత పనులను డీసీ వైస్ ప్రెసిడెంట్ వల్లెం నాసయ్య, మండల టీడీపీ నేత దుద్దేల చిన్న గాలెయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. సుమారు రూ.60వేలతో ఐదు కిలోమీటర్ల మేర కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను, చిల్లచెట్లను జేసీబీ పొక్లెయిన్ సాయంతో తొలగింపజేశారు. ఈకార్యక్రమంలో కూటమి నేతలు నక్కా వెంకటేశ్వర్లు, గాదె రామాంజనేయులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - అద్దంకి : కేంద్ర ప్రభుత్వం నూతన సంస్కరణలతో తగ్గించిన జీఎస్టీ పై అద్దంకిలో గురువారం జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ నియోజకవర్గ నోడల్ అధికారి మల్లికార్జున మాట్లాడుతూ పేద మధ్యతరగతి వర్గాలకు జీఎస్టీ తగ్గింపు వల్ల ఎంతో మేలు జరిగిందన్నారు. వివిధ రకాల వస్తువులపై నాలుగు నుంచి రెండు శ్లాబులు కుదించారు అన్నారు. ప్రధానంగా వాహన రంగంలో వాహనాలపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గిందన్నారు. లక్ష రూపాయల వాహనానికి 10వేలు జీఎస్టీ తగ్గినట్టు చెప్పారు. కలవకూరు రోడ్డు నుంచి బంగ్లా రోడ్డు వరకు జీఎస్టీ ప్రచార ఆటో ర్యాలీ నిర్వహించారు.

19న మట్టి రంగు పుస్తకావిష్కరణ సభ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్రముఖ కవయిత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ చిల్లర భవానీ దేవి రచించిన మట్టి రంగు కవితా సంపుటి పుస్తకావిష్కరణ మహోత్సవం ఈనెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక హోటల్ గౌతం వేదిక హాలులో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించ బడునని బాపట్ల జిల్లా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్ తెలిపారు.ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ సాహితీ వేత్తగా విఖ్యాతినొందిన చిల్లర భవాని దేవి రచించిన ఈ 59 వ పుస్తక పుస్తకావిష్కరణ సభకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని,ప్రముఖ రచయిత్రి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి సభాధ్యక్షత వహించనున్నారని,ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ బీరం సుందరరావు పుస్తక పరిచయాన్ని చేస్తారని,ఆత్మీయ అతిథిగా ఫోరంఫర్‌బెటర్ కార్యదర్శి డాక్టర్ పి.సి సాయిబాబు పాల్గొననున్నట్లు ఆయన వివరించారు.ఈ సందర్భంగా కోటంరాజు సత్యనారాయణ శర్మ దంపతుల స్మారక సాహితి పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అప్పాజోస్యుల,సత్యనారాయణకు డాక్టర్ భవానీ దేవి కుటుంబ సభ్యులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సాహిత్య సభలో సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రిన్సిపాల్ రవిచంద్ర కుమార్

విశాలాంధ్ర - రేపల్లె : స్థానిక శ్రీఏబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రేపల్లెలో ఎన్‌సిసి 22 ఆంధ్రా బెటాలియన్, తెనాలి ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సర డిగ్రీ విద్యార్థులకు ఎన్‌సిసిలో నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. సి రవిచంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సిసిలో చేరి క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. ఉన్నతమైన ఆశయాలతో ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన 22 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఏ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవా భావం, దేశభక్తి, సంఘటిత శక్తిని పెంచేందుకు ఎన్ సి సి శిక్షణ దోహదపడుతుందన్నారు. విద్యార్థులు పట్టుదలతో శిక్షణ పొందితే వారి భావి జీవితం ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి ఎన్రోల్మెంట్ చేసుకున్నారు. తొమ్మిది మంది అబ్బాయిలు, ఆరుగురు అమ్మాయిలు సెలెక్ట్ అయ్యారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎన్‌సి ఆఫీసర్ కె బాలగురవయ్య, ఎన్‌సిసి అధికారులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

విశాలాంధ్ర - యద్దనపూడి : గ్రామంలో విరివిగా మొక్కలు నాటి పర్యా వరణాన్ని కాపాడుకుందామని టీడీపీ నాయకులు గుదే తారక రామారావు,, కొర టాల వంశీకృష్ణ అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ, యూనివర్సల్ టుబాకో వారు సంయుక్తంగా మొక్కలు పంపిణీ కార్యక్రమం చేపట్టింది. రైతులకు జామ, మామిడి, నిమ్మ, సపోటా సీతాఫలం , నేరేడు మొక్కలను పంపిణీ చేశారు. గ్రామంలోని చెరువు కట్టలపై సుమారు 400 మొక్కలు నాటారు. గతంలో వీరు గ్రామంలో చెరువులో పూడిక తీత మట్టిని ఉచితంగా రైతులకు అందించటంతో పాటు చెరువు కట్టను పటిష్టం చేశారు.ఈ సందర్భంగా వీరిని పలువులు గ్రామస్తులు ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రత్న కుమార్, విక్రమ్ గ్రామస్థులు నిమ్మల సాంబశివరావు, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు, కొరటాల వీరయ్య చౌదరి, రైతులు పాల్గొన్నారు.

పోషకాహారం ఆరోగ్యానికి పునాది

సీడీపీవో సుచిత్ర

విశాలాంధ్ర - రేపల్లె : పోషకాహారంతో ఆరోగ్యం ఆనందం ఉంటుందని పోషకాహారాన్ని ప్రతి మనిషి దినచర్యలో భాగంగా పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అంగన్వాడి ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. సుచిత్ర అన్నారు. గురువారం రేపల్లె ప్రాజెక్ట్ పరిధిలోని ప్రాజెక్ట్ ఆఫీస్ నందు 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం ముగింపు కార్యక్రమాన్ని ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నప్రాసనలు, శ్రీమంతాలు, వెల్ బేబీ షో, అలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న వంటకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. 40 సంవత్సరాల సేవ పూర్తి చేసిన అంగన్వాడీ కార్యకర్తలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ మాసోత్సవంలో ఫోటోలు అప్‌లోడ్ చేసి ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకువెళ్ళడంలో చురుకుగా ఉన్న లీడర్లను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలోసీడీపీఓ ఎం. సుచిత్ర,ఆయుర్వేదిక్ డాక్టర్ మాధవి,సూపర్వైజర్లు సి హెచ్ హిమబిందు, తమ్ము రాధికా, మంజుల, నాగలక్ష్మి, బిపిసి అరుణ,శ్రీనివాస్, సిఆర్ఎఫ్ ఆర్గనైజేషన్,ఎన్‌జీఓ లు ప్రెసిడెంట్ అంకమ్మరావు,సెక్రటరీ గంగాధర్,శ్రావణ్ కోశాధికారి శ్రావణ్,వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర,వైస్ ప్రెసిడెంట్ ఐలయ్య,శ్రీనివాస్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శుక్రవారం 17 । అక్టోబరు । 2025

నానో యూరియాపై అవగాహన

విశాలాంధ్ర - చెరుకుపల్లి : నానో యూరియా మొక్కలకు నత్రజనిని సమర్థవంతంగా అందిస్తుందని,దీని వలన కిరణజన్య సంయోగ క్రియ, రూట్ బయోమెన్ మెరుగుపడి అధిక దిగుబడి లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి మొహమ్మద్ ఫరూక్ అన్నారు.గురువారం కావూరు గ్రామంలో ఆత్మా వారి ఆధ్వర్యంలో నానో యూరియాపై అవగాహన,డ్రోన్ ద్వారా పిచికారి విధానాన్ని ప్రదర్శన రూపంగా రైతులకు చూపించడం జరిగింది.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఆరో లీటర్ నానో యూరియా 45 కిలోల యూరియా వస్తాకు సమానమైన ఫలితం ఇస్తుంది కనుక ఖర్చు తక్కువ తుందన్నారు.యూరియా బస్తా కంటే నానో యూరియా బాటిళ్లను నిల్వ చేయడం,రవాణా చేయటం చాలా సులభం అన్నారు.నానో యూరియా వాడిన మొక్కలలో క్లోరోఫిల్ స్థాయిలను పెంచుతుందని,ఆకుపచ్చని రంగును మెరుగుపడుతుందని,చురుకైన పెరుగుదలకు దోహదపడుతుందన్నారు. సాధారణంగా ఒక ఎకరాకు 500 ఎంఎల్ నానో యూరియా సరిపోతుంది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బిడి రామకృష్ణ,కే.ప్రియాంక గ్రామ వ్యవసాయ సహాయకులు పృథ్వీ రైతులు పాల్గొన్నారు.

విధి కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో బీసీ కాలనీలో షేక్ వలికి చెందిన గొర్రెల దొడ్డిపై వీధి కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి.రూ.200,000 నష్ట వాటిల్లినట్టు బాధితుడు కన్నీటి పరమతమయ్యారు.గ్రామంలో ఏడాది నుండి వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్న సంబంధించిన అధికారులలో స్పందన లేకపోవడంతో ఈ పరిస్థితి నెలపొందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు వీధి కుక్కలను అడవులకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సాగు సమయంలో జీవన ఎరువులు ఉపయోగించడం వలన రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చని బాపట్ల ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుతరాజు అన్నారు.చీరాల మండలం తోటవారిపాలెం గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద ఆచార్య రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జీవన ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవన ఎరువులు వాడటం వల్ల పంటలో నత్రజని,పొటాషియంల శాతాన్ని పెంచవచ్చున్నారు.రసాయన ఎరువులు వాడకుండా మొక్కకు పోషకాలను అందించవచ్చని తెలిపారు.జీవన ఎరువులు కావలసిన రైతులు ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చీరాల మండల వ్యవసాయ శాఖ సిబ్బంది,కళాశాల విద్యార్థులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట సుబ్బారెడ్డికి నివాళులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ సైనికుడు వెంకట సుబ్బారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు నివాళులర్పించారు.బాపట్ల పట్టణం నరాలశెట్టిపాలెంలో సైనికుడు వెంకట సుబ్బారెడ్డి గృహంలో జరిగిన పెద్దఖర్మలో పాల్గొని స్వర్గీయ వెంకట సుబ్బారెడ్డి చిత్రపటానికి మాజీ సైనికులతో కలిసి తాండ్ర సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అయన వెంట జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్ రెడ్డి,కర్లపాలెం మండల టీడీపీ ఉపాధ్యక్షులు మాజీ సైనికులు చంద్ర శేఖర్ రెడ్డి, బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు,ట్రెజరర్ పువ్వాడ యల్లమంద, జాయింట్ సెక్రెటరీ పీటా సారథి,రాష్ట్ర కమిటీ గౌరవ సలహా దారులు సుంకర శేషగిరిరావు, ఆంజనేయులు ,మర్రి బాబు రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలపై శ్రద్ధ వహించాలి

మోటార్ వెహికల్ ఇనిస్పెక్టర్ ప్రసన్న

విశాలాంధ్ర - కర్లపాలెం : విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని బాపట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసన్నకుమారి అన్నారు.మండల కేంద్రంలోని భార్గవి హై స్కూల్లో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు.అదే విధంగా ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యంతో విద్యను అభ్యసించాలని కోరారు.నగరం మండలం ఉల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్.జి.ఎఫ్ డివిజన్ స్థాయి అండర్-17 బాలికలచెస్ పోటీలలో భార్గవి హైస్కూల్ విద్యార్థిని ఏట్రా అమూల్య అండర్-14 విభాగంలో భార్గవి హైస్కూల్‌కు చెందిన ఎట్ర దేవిశ్రీ జిల్లాస్థాయికి ఎంపిక కావడం పట్ల ఆమె విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.ఎంపికైన విద్యార్థులకు ప్రసన్నకుమారి చేతుల మీదుగా మెడల్స్‌ను అందజేశారు.అనంతరం పాఠశాల సిబ్బంది ప్రసన్నకుమారిని ఘనంగా సన్మానించారు. పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పేరాల వెంకట సురేష్,ప్రిన్సిపాల్ బాపట్ల లక్ష్మి, ఉపాధ్యాయులు దివ్య,సునీత, సాహితీ, ప్రసన్న కుమారి, సత్యవతి,రిజ్వానా,ప్రేమావతి,చక్రవర్తి శివప్రసాద్,పిఈటీ శివారెడ్డి పాల్గొన్నారు.

దీపావళి మందుల గోడౌన్ల పరిశీలన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రానున్న దీపావళి పర్వదిన దృష్ట్యా చీరాల,వేటపాలెం, కారంచేడు మండలాల్లో ఉన్న దీపావళి మందుల గోడౌన్లను చీరాల ఆర్డీఓ టి.చంద్ర శేఖర్ నాయుడు,డీఎస్పీ మొహమ్మద్ మోయిన్, అగ్నిమాపక శాఖ ఏడీ రామకృష్ణలు సిబ్బందితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజలు క్షేమంగా దీపావళి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండటానికి దీపావళి మందుల గోడౌన్లను తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా గూడౌన్లలో సౌకర్యాలు,ప్రమాద నివారణ పరికరాలు తదితర అంశాలను పరిశీలించారు.భద్రతా ప్రమాణాలు రాజీ లేకుండా తీసుకోవాలని సూచించారు. భద్రతా చర్యలు,జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో చీరాల మండలం తహసీల్దార్ కె.గోపీకృష్ణ, వేటపాలెం మండలం తహశీల్దార్ గీతారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ

విశాలాంధ్ర - సంతమాగులూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25లో జరిగిన పనులపై పాతమాగులూరులో సర్పంచ్ జిర్రా విజయబాబు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో ఉపాధి పథకం ద్వారా గ్రామంలో జరిగిన పనులపై లేవనెత్తారు.ఎన్ని పనులు జరిగాయి,ఎంతమేర నిధులు ఖర్చు చేశారని వివరాలు నమోదు చేశారు.అయితే కొన్నిచోట్ల చనిపోయిన వారికి కూడా మస్టర్లు వేసి,నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు సమాచారం.దీనిపై ఆడిట్ బృందం వారు ఉన్నతాధికారులకు ఇచ్చే నివేదిక ఆధారపడి ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 దార్ల దినేష్ కుమార్, సెక్రటరీ జానీబాషా,టీడీపీ నేత చల్లా బ్రహ్మారావు పాల్గొన్నారు.

- ఏల్చూరులోనూ : ఉపాధి హామీ పథకం కింద సోషల్ ఆడిట్ బృందం వారు ఏల్చూరు పంచాయతీ కార్యాలయంలో తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఉపాధి పనులు ద్వారా ఖర్చు అయిన నిధుల వివరాలు నమోదు చేశారు. ఈకార్యక్రమంలో సెక్రటరీ పూర్ణచందు,టీడీపీ నేత దుద్దేల చిన్న గాలెయ్య పాల్గొన్నారు.

నకిలీ మందు గుర్తించేందుకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్

విశాలాంధ్ర - బాపట్ల : ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పలు మద్యం షాపుల్లో ఏ ఆ పనితీరును ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు.మద్యం కొనుగోలుదారులు వారి మొబైల్లో ఈ యాప్ ఇన్స్టాల్ చేసుకుని క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేస్తే మద్యం ఎక్కడ ఎప్పుడు తయారీ బ్రాండ్ వివరాలు తెలుస్తాయని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు బార్లు అన్ని కలిపి 140 ఉన్నాయని అన్ని షాపుల్లో యాప్ ద్వారానే అమ్మకాలు జరపాలని ఆదేశించినట్లు తెలిపారు. మద్యం ఎవరైనా అనుమతులు లేకుండా అమ్మితే సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

డంపింగ్ యార్డుగా తలపిస్తున్న చెత్త

విశాలాంధ్ర - బల్లికురవ : బల్లికురవ నుండి చెన్నుపల్లి మధ్య ఉన్న వీర్ల చెరువు వద్ద రోడ్డు వెంబడి డంపింగ్ యార్డుగా తలపిస్తుందని ప్రజలు వాపోతున్నారు.బల్లికురవ నుండి చెన్నుపల్లి వెళ్లే రోడ్డు మార్గాన ప్రయాణికులు ప్రయాణిస్తున్నప్పుడు రోడ్డు వెంబడి పేరుకుపోయిన చెత్త కుళ్ళిపోయి దురవాసన రావడంతో ముక్కు మూసుకొనిపోవాల్సి వస్తుందని అంటున్నారు.అలాగే రోడ్డు మీద ప్రయాణిస్తున్నప్పుడు గాలి వేస్తున్నప్పుడు చెత్త కాగితాలు మోటార్ వాహనాలు నడుపుతున్నప్పుడు కళ్ళకు అడ్డం పడుతున్నాయని ఎదురుగా వాహనాలు వస్తే అంతే సంగతులని ఇప్పటికైనా సంబంధించిన అధికారులు,కార్మికుల చేత పేరుకు పోయిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు. అలాగే బల్లికురవ మండలంలోని ఉన్న గ్రామాలలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించి ఖాళీ ప్లేస్‌లో ఈ చెత్త కాగితాలు వేసే మార్గం చూడాలని మండల ప్రజలు తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

విశాలాంధ్ర - బాపట్ల : స్వయం ఉపాధితో ఆర్థిక అభివృద్ధి సాధ్యమని ఎస్ టూ నిడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు సురేష్ బాబు తోట తెలిపారు. మత్యకార ఒంటరి మహిళ చోడిపల్లి అప్పల నరసమ్మ,దినసరి ఆదాయం ఆధారిత కుటుంబానికి చెందిన అరికెల వెన్నెలకి ఉచిత కుట్టు మిషన్లు గురువారం అందజేశారు.పుట్టిన ఊరుపై మక్కువ సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అడవిపల్లిపాలెం నాయకులు శివ గోగు,నైపుణ్య శిక్షకురాలు కుందేటి కుమారి, మద్దిబోయిన స్వప్న,తిర్రి సుజతలు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కారంలో చొరవ తీసుకోవాలి

- రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

విశాలాంధ్ర - బాపట్ల : బీసీల సమస్యలు పరిష్కారం చూపటంలో చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు.జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌ని కలిసి సన్మానించి ఆయన అభినందించారు.అనంతరం జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వరరావుని కలిసి అభినందనలు తెలిపారు.న్యాయపరమైన సూక్ష్మ చూపుతో కేసులను పరిష్కరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్,జిల్లా కార్యదర్శి మారం రవికుమార్,పట్టణ యువజన ప్రధాన కార్యదర్శి కంకణాల రాంబాబు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ప్రభుత్వ భవనాలు

పూర్తైన ప్రారంభానికి నోచుకోని సచివాలయాలు

విశాలాంధ్ర-పామూరు : మండలంలో ప్రభుత్వ భవనాలకు ఆలనా పాలనా లేక అసాంఘిక కార్యకలాపాలకు నిలయముగా మారుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. మండలంలో 19 గ్రామ సచివాలయాల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో సచివాలయ నిర్మాణానికి రూ.35 లక్షలు నిధులు ను ప్రభుత్వం వెచ్చించింది. వీటిల్లో ఏడు సచివాలయాలనే పూర్తిచేసి ప్రాంభించారు. మిగిలినవి అసంపూర్తిగా ఉన్నాయి.. వాటిల్లో పడమట కట్టకిందపల్లి, బోడ వాడ గ్రామ సచి వాలయాలు కోర్టు కేసులతో నిలిచిపోయాయి. మిగిలినవి అర్థంతరంగా ఆగిపోయాయి. పామూరు పట్టణంలో నాలుగు గ్రామ సచివాలయాలకు గాను ఒకటవ సచివాలయాన్ని ప్రారంభించారు. 2వ సచివాలయం అంకాలమ్మ వీధిలో దాత ఇచ్చిన స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే నిర్మాణ దశలోనే వదిలివేయడం తో చిల్ల చెట్ల పొదల మధ్య మొండిగోడలు దర్శ నమిస్తున్నాయి. దీంతో ఆకతాయిలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మోపాడు సచివాల యం, మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన 3, 4 సచివాలయాలు అన్ని హంగులతో పూర్తయి నా ప్రారంభానికి నోచుకోలేదు. అలాగే పంచాయతీరాజ్ అతిథి గృహం శిధిలావస్థకు చేరింది. రెవెన్యూ గ్రామచావిడి ని ఉపయోగించుకోకపోవడంతో మూత్ర విసర్జన కు నిలయముగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర - నిజాంపట్నం : దీపావళి పండగ సందర్భంగా బాణసంచా విక్రయాలకు అనుమ తులు తప్పనిసరిగా తీసుకోవాలని అడవులదీవి ఎస్సై బత్తుల బాబురావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. బాణసంచా విక్రయాల కోసం సంబంధిత అధికారుల నుండి సరైన అనుమతులు తప్పక పొందాలన్నారు. నిబంధనలు అతిక్రమించి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని అలాగే బాణసంచా సామాగ్రి సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీపావళి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా శిద్ధా సుధీర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి హరిహర క్షేత్రంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శిద్ధా సుధీర్ కుమార్ జన్మదిన వేడుకలు వైభవంగా హరి హర క్షేత్రంలో నిర్వహించడం జరిగింది. ఆలయ అర్చకులు,ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు. తదనంతరం హరిహర క్షేత్రంలోని అన్ని గుడిల్లో స్వామివారికి పూజా కార్యక్ర మాలు నిర్వహించిన తర్వాత ఆశీర్వచనం అందించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రివర్యులు శిద్ధా రాఘవరావు సతీమణి లక్ష్మీ పద్మావతి మరియు సుధీర్ కుమార్ వారి దంపతులు కుటుంబ సభ్యులు పాల్గొని కేక్ కట్ చేశారు. గ్రానైట్ మేనేజర్స్, మరియు సిబ్బంది గజమాలతో సత్కరించారు. తదనంతరం పాఠశాల విద్యార్థినులకు యూనిఫాం,విద్యార్థులకు స్పోర్ట్స్ సామగ్రి అందజేశారు. టిడిపి నాయకులు కాట్రగడ్డ రమణయ్య,కందిమళ్ళ గంగా ధర్,ముప్పూరి చలమయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, గోగినేని వెంకటేశ్వర్లు,బొమ్మిశెట్టి మధు,బొమ్మిశెట్టి కిరణ్, నూకల సుబ్రమణ్యం, నూకల హరి, గ్రంధి సుబ్రహ్మణ్యం, గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరి, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో వైసీపీని బలోపేతం చేయాలి

ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాతపూడి రాము

విశాలాంధ్ర-పామూరు రూరల్ : ఎస్సీ ఎస్టీ క్రిస్టియన్ మైనార్టీ అభివృద్ధి జరగాలంటే వైయస్ఆర్సీపీ పార్టీని బలోపేతం చేయాలని ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాటిపూడి రాము అన్నారు. స్థానిక వైయస్సార్సీపీ కార్యాలయం లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిథిగా గంగసాని హుస్సేన్ రెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి, కోఆప్షన్ నాయబ్ రసూల్, కటకాల వెంకటరత్నం హాజరయ్యారు. అనంతరం అంబేద్కర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి, చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. నాయకులకు తాటిపూడి రాము శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ క్రిస్టియన్ మైనార్టీ అభివృద్ధి జరగాలంటే వైఎస్ఆర్సిపి పార్టీకి బలోపేతం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాలేటి ప్రేమ్ కుమార్, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, గంధం ఏసురత్నం, పోతల రమేష్, ఇండ్లనంద కిషోర్ , సల్మాన్, సమరం రత్తమ్మ ,వైఎస్సార్సీపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోడీ పర్యటనతో రాష్ట్రానికి ప్రయోజనం ఏది?

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ జావీద్ అన్వర్

విశాలాంధ్ర-మార్కాపురం : పేద ప్రజలకు జీఎస్టీ తగ్గించామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా కర్నూలులో సభ ఏర్పాటు చేసి,ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించడం వల్ల రాష్ట్రానికి ఏమి ప్రయోజనం ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు సయ్యద్ జావిద్ అన్వర్ గురువారం న ఒక ప్రకటనలు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సయ్యద్ జావిద్ అన్వర్ మాట్లాడుతూ ఇటువంటి పర్యటన వలన కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా కావడం తప్ప ప్రయోజ నమేమీ లేదని తెలిపారు. నరేంద్ర మోడీ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇటువంటి తూతు మంత్రపు పర్యటనల వల్ల ఈ ప్రాంతానికి ఒరి గిందేమీ లేదని అన్నా రు. సుదూర ప్రాంతా ల నుండి వచ్చే భక్తులకు శ్రీశైలానికి వెళ్లడానికి కనీసం రైల్వే కనెక్టి విటీని కూడా కూటమి నాయకులు ఏర్పాటు చేయించకపోవడం ఈ ప్రాంత నాయకుల అసమర్ధతకు నిదర్శనమన్నారు. జీఎస్టీ వలన వసూలు చేసే ధనం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారో ఎవరికి అంతుపట్టని విషయం అని అన్నారు..ఎన్డీఏ కూటమి పాలన వల్ల ఈ రాష్ట్రం అగమ్య గోచరంగా తయారైందని పేర్కొన్నారు.

మల్కాపురం పంచాయతీని సందర్శించిన ఎంపీడీవో

విశాలాంధ్ర -తాళ్లూరు: మల్కాపురం పంచాయితీని ఎంపీడీఓ అజిత గురువారం సందర్శించారు. సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాలను సంబంధిత సర్వేలను సకాలంలో పూర్తి చెయ్యాలని సూచించారు. బయో మెట్రిక్ హాజరు సకాలంలో నమోదు అయ్యేలా సకాలంలో కార్యాలయాలకు వచ్చి ప్రజలకు సేవలు అందించాలని కోరారు. గ్రామ కార్యదర్శి శేషమ్మ పాల్గొన్నారు.

తువ్వపాడులో పారిశుధ్య పనులు పరిశీలన

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని తువ్వపాడు గ్రామపంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెత్త సంపద షెడ్డును పరిశీలించారు. ప్రజలకు వ్యక్తిగత శు భ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు కు సూచించారు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేయించాలని ఇంటి పనులు వసూలు చేయాలని సూచించారు ఈయన తోపాటు ఎంపీడీవో డి ఈశ్వరమ్మ యు ఆర్ డి శ్రీదేవి క్లాస్ మిత్రలు ఉన్నారు.

ముగిసిన పోషణ మాసోత్సవం

విశాలాంధ్ర - ముండ్లమూరు : ఉల్లగల్లు పంచాయతీ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పెద ఉల్లగల్లు-1 అంగన్ వాడీ కేంద్రంలో గురువారం పంచాయతీ పోషణ ముగింపు మాసోత్సవం నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి రాజేశ్వరి, ఎం ఎస్ కే శిరీషలు మాట్లాడుతూ స్థానికంగా లో కాస్ట్ నో కాస్ట్ లో దొరికే పోషకాలు ఉండే ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు ఉపయోగించి ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. అంగన్ వాడీ కార్యకర్తలు రాధ, ప్రియ, చైతన్య భారతి, సావిత్రి ప్రసన్న లక్ష్మి, వెంకట రమణ, విజయలక్ష్మి, బాలమ్మ, గాలెమ్మ ల ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన స్టాల్ను ఏర్పాటు చేసారు. పోషకాహారం ప్రాముఖ్యతను అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు వివరించారు.

గనివానిపాడు రహదారి బాగు చేయండి ...

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గనివానిపాడు వెళ్లే ప్రధాన రహదారి వర్షానికి బురద మయింది. ఈ రోడ్డున రాకపోకలు సాగాలంటే నరకం చూడాల్సిందే. వాగు మడుగు దాటిన దగ్గర నుంచి గనివానిపాడు వరకు మట్టి రోడ్డు కొద్దిపాటి వర్షం వలన బురదమయంగా మారింది. దీంతో వాహనాలు పాదాచారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మా రోడ్డును తారు రోడ్డుగా మార్చాలని అధికారులను వేడుకుంటున్నారు.

ఫ్లోరోసిస్ నివారణకు కృషి చేయాలి

విశాలాంధ్ర - తాళ్లూరు: ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కలిగి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రకాశం జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్ టెంట్ అధికారి వి.అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని శివరామపురం , తాళ్లూరు కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో గురువారం తాళ్లూరు పీహెచ్సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సురక్షితమైన నీటిని తాగటం వలన ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండవచ్చని చెప్పారు. నీటిలో ఫ్లోరోసిస్ అధికంగా ఉండే పండ్లపై గారలు ఏర్పడ తాయని చెప్పారు. శివరామపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం నాగి రెడ్డి , ఎంపీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రమాదేవి , కస్తూరిభా పాఠశాల ప్రిన్సిపాల్ సుజిత , పీహెచ్ఎన్ వై విజయమ్మ , ఫ్లోరోసిస్ ఎల్ టి అంజి రెడ్డి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-సిఎస్ పురం : విద్యార్థులు తమ జీవన ప్రగతిని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అన్నారు. గురువారం కళాశాల ఆవరణంలోని మినీ ఆడిటోరియంలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా కదిరి పార్థసారథి పాల్గొని వ్యవసాయ బీఎస్సీ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకను ప్రారంభించారు. సిఎస్ పురం మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రాజాల కొండారెడ్డి, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్,కనిగిరి కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ వి సుదీప్ ప్రశాంత్ గారు,మేనేజర్ కె.విజయలక్ష్మి ,మాజీ ఎంపిటిసి లు మునగల నారాయణ రెడ్డి మూరం కాశిరెడ్డి,ఉప సర్పంచ్ టి బాబురావు,కొట్టే శ్రీను,నున్నా నారాయణ , టి లక్ష్మీ నారాయణ,కె వి యన్ ఎల్ ప్లస్ కళాశాల ఛైర్మెన్ మూరం మస్తాన్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు బి.ప్రసాదు, ఉపాధ్యాయులు, కొట్టే అంకయ్య,సుంకరి అంజనాద్రి ,వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

3న సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె

- డీవీ సుబ్బారావు, సింగరకొండ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ నవంబర్ 3వ తేదీన సమ్మె చేయనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డివి సుబ్బారావు, తన్నీరు సింగరకొండ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టే సమ్మెలో భాగంగా ముందస్తుగా బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాధ రెడ్డికి వినతి పత్రం చేసామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఎవరైనా పారిశుద్ధ్య కార్మికులు చనిపోతే ఆ కుటుంబం ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అప్కాస్ వర్కర్లు కూడా 62 సంవత్సరం వరకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పొట్లూరి కామాక్షి, బి.ఎలిజబెత్ రాణి, సి.హెచ్ వెంకట లక్ష్మి, డి వి లక్ష్మి పాల్గొన్నారు.

అద్దంకిలో నగదు చోరీ

విశాలాంధ్ర - అద్దంకి : బైక్ సీట్ కవర్లో ఉంచిన నగదు చోరీ జరిగిన సంఘటన అద్దంకిలో గురువారం చోటుచేసుకుంది.సీఐ సుబ్బరాజు తెలిపిన వివరాల మేరకు ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురంకు చెందిన కే.వెంకటేశ్వర్ రెడ్డి గురువారం అద్దంకిలో ఓ బ్యాంకులో రూ 1.40వేలు నగదు డ్రా చేసి బైక్ సీట్ కవర్‌లో ఉంచుకొని పోతురాజు గండి వద్ద ఆటోమొబైల్ షాపులో వస్తువులు కొనుగోలు చేసి సీటు కవర్లో ఉన్న నగదును చూసుకోగా నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

22 నుండి కార్తీక మాస నిత్యాభిషేక పూజా కార్యక్రమాలు

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని ఇసుకపల్లి 17వ వార్డులో గల శ్రీభ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 22 నుండి నవంబర్ 20వ తేదీ వరకు నెలరోజులపాటు కార్తీక మాస నిత్యాభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు తెలిపారు.పవిత్ర కార్తీక మాసంను పురస్కరించుకొని నెలరోజుల పాటు స్వామివారికి జరిగే నిత్యాభిషేక పూజా కార్యక్రమాలలో భక్తులు తమ పేర్లను ముందుగా దేవాలయంలో అర్చకులు వద్ద నమోదు చేసుకుని కార్తీకమాస పూజా కార్యక్రమాల్లో పాల్గొని తరించవలసిందిగా ఆయన కోరారు.ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నేత అనగాని శివప్రసాద్‌ను కలసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి కార్తీక మాస నిత్యాభిషేక పూజా కార్యక్రమాలను గురించి వివరించారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



విశాలాంధ్ర - నిజాంపట్నం : అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని ఎంపీహెచ్ఈఓ సాంబశివరావు అన్నారు. గురువారం కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు సీపీఆర్‌పై అవగాహన ఉండడం అత్యంత అవసరమన్నారు. ఈ నెల 13 నుండి 17 వరకు ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు సాంబశివరావు, మాధవి, పిహెచ్‌ఎన్ లక్ష్మి, స్టాఫ్ నర్సులు అరుణ,వనిత,104 సిబ్బంది బాజీలు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు రైస్ మిల్లులు సిద్ధం చేయాలి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో వరి ధాన్యం సేకరించడానికి రైస్ మిల్లులు,రైతు సేవా కేంద్రాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు.గురువారం వేమూరు నియోజకవర్గం అమృతలూరు మండలం కూచిపూడి గ్రామంలో రైస్ మిల్లును,రైతుసేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబర్ నుండి వరి ధాన్యం దిగుబడులు ప్రారంభం అవుతాయన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా వరి ధాన్యం సేకరించి రైస్ మిల్లులో,రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేసిన నిల్వలు చేయడానికి అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అమృతలూరు తహశీల్దార్ నెహ్రూ బాబు వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగ వంతం చేయాలి

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ భూసేకరణ పనులు వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు.గుండ్లకమ్మ ప్రాజెక్టుపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు.గుండ్లకమ్మ ప్రాజెక్ట్ కింద 50 ఎకరాల భూసేకరణ చేయకపోవడంతోనే బాపట్ల జిల్లాలో 13,876 ఎకరాలకు సాగునీరు రావడంలేదని కలెక్టర్ చెప్పారు.ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామంలో 50 ఎకరాల భూసేకరణ పనులు నిలిచిపోవడంపై ఆరా తీశారు.తక్షణమే భూ సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ 14 గేట్లు మరమ్మతులు పూర్తి కాగా,మరొకటి పనులు జరుగుతున్నాయన్నారు.వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు ద్వారా బీడు భూములకు సాగునీరు అందించడం లక్ష్యం అన్నారు.తాజాగా బాపట్ల జిల్లాలో 2,600 ఎకరాల భూమి ఆయకట్టు పరిధిలోకి తీసుకురావడానికి గజిట్ విడుదల చేయాల్సి ఉందన్నారు.ఇందుకోసం అధికారికంగా ప్రకటన విడుదలకు అన్ని చర్యలు చూసుకుంటున్నామన్నారు. మరో 78 ఎకరాల భూమి ఆరికట్టులోకి తెచ్చేందుకు జలవనరులు, వ్యవసాయ,రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాల్సి ఉందన్నారు.ఈ ప్రక్రియ వారంలో పూర్తి చేయాలన్నారు.కొరిశపాడు,అద్దంకి మండలాలలో మూడు గ్రామాలలో 1,100 కుటుంబాలకు పునరావాసం కింద నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు.ఈ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఆర్డీవో,సంబంధిత తహసీల్దారులకు సూచించారు.ఈ సమావేశంలో ప్రాజెక్టుల ఎస్ఈ అబూతలీమ్,ఆర్డీవో చంద్రశేఖర్,ఉప కలెక్టర్లు,తహసీల్దార్లు పాల్గొన్నారు.

ముగిసిన పోషణ మాసోత్సవాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలో 8వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలు ముగింపు వేడుకలను సీడీపీఓ డి.సుధా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.అతిథిగా సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ టి.రమేష్ హాజరయ్యారు.ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 16 వరకు సంతమాగులూరు,బల్లికురవ మండలాల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో పలు అంశాలపై కార్యక్రమాలు నిర్వహించి, ప్రాజెక్టు స్థాయిలో ముగింపు సభ ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు.ఈ ఏడాది పోషణ మాసోత్సవాల్లో భాగంగా నవజాత శిశువులకు తల్లిపాల ప్రాముఖ్యత,ఆరు నెలలు నిండాక పిల్లలకు తల్లిపాలతో పాటు ఎటువంటి ఆహారం ఇవ్వాలి,పిల్లల్లో వచ్చే ఊబకాయం వాటి నష్టాలు,గర్భిణులు,బాలింతలు పిల్లల సంరక్షణలో పురుషుల భాగస్వామ్య ప్రాముఖ్యత,3-6 సంవత్సరాల పిల్లలకు అపార్ ఐడీ నమోదు వంటి వాటిపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీల ద్వారా పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్నారని,లబ్ధిదారుల సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చిన్నారుల మహిళల హెల్ప్ లైన్ నెంబర్స్ గోడ పత్రాలను ఆవిష్కరించారు.అనంతరం సీమంతాలు నిర్వహించి,గర్భిణులకు సారే అందజేశారు.అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో ఉత్తమ సేవలు అందిస్తున్న టీచర్లకు ప్రతి సెక్టార్ నుంచి ఒక ఉత్తమ అంగన్వాడీ టీచర్లు గుర్తించి వారిని శాలువా,జ్ఞాపికలతో సత్కరించారు. కొప్పరం నెహ్రూ నగర్ అంగన్వాడీ టీచర్ తిరుమల కుమారుడు సిద్ధార్థ అండర్-14 జట్టు కింద అంతర్ రాష్ట్ర క్రికెట్ జట్టులో ఛాంపియన్ ట్రోఫీ గెలిచినందుకు ఆమెను ఏఎంసీ ఛైర్మన్, సీడీపీఓ, ఐసీడీఎస్ బృందం అభినందించి, శాలువాతో సన్మానించారు. సూపర్ వైజర్లు సుష్మారాణి, ప్రమీలా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీ ఉమామహేశ్వర్‌ని కలిసిన జేసి భావన

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల జిల్లా నూతన అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వి. భావన గురువారం స్థానిక జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

వర్షపు నీటిని తొలగించండి

విశాలాంధ్ర - బాపట్ల : వర్షం నీటిని తొలగించాలని ప్యాడిసన్ పేట ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.ఇళ్ల చుట్టూరు వర్షం నీరు చేరి ఉండటం వలన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు.నీటి వల్ల దోమలు విషపురుగులు, ఇళ్లల్లోకి వస్తున్నాయని సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రామాల పరిశుభ్రతలో క్లాప్‌మిత్రల పాత్ర కీలకం

ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి

విశాలాంధ్ర - నిజాంపట్నం : గ్రామాలను పరిశుభ్రం,పచ్చదనంగా మార్చేందుకు క్లాప్ మిత్రలు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు.థీమ్-5,క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా గురువారం నిజాంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అలాగే నిజాంపట్నం ఎస్డబ్ల్యూపీసీ షెడ్డులో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల క్లాప్ మిత్రలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామం పరిశుభ్రంగా, పచ్చగా,సుస్థిరంగా మారే దిశగా క్లాప్ మిత్రలు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.గ్రామాల్లోని ప్రజలలో స్వేచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే బాధ్యత తమదేనని చెప్పా రు. గ్రామాల్లో స్వచ్ఛతతో పాటు మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చున్నారు. దీంతో గ్రామాలు పచ్చగా మారితే పర్యావరణ సమతుల్యతతో పాటు ఆరోగ్యవంతమైన జీవన వాతావరణం ఏర్పడుతుందన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏవో టి.లక్ష్మీకాంతమ్మ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.